క్లుప్తంగా

మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని తెనాలి మండల విద్యాశాఖాధికారి మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. దేవీచౌక్‌లోని షారోన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వార్షిక క్రీడలను ఆయన ప్రారంభించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులు సెల్ ఫోన్‌కు అలవాటు పడి క్రీడలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షారోన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ డైరెక్టర్ కె.శ్యామ్ బెనర్జి, ప్రిన్సిపల్ కె.మేరిబెనర్జి పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న కమిషనర్ జస్వంతరావు

తెనాలిరూరల్: పట్టణంలోని వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని 27, 28 వార్డుల్లోని 32, 33 సచివాలయాలకు మంగళవారం వెళ్లిన కమిషనర్ వార్డు సెక్రటరీల పనితీరు గురించి ఆరా తీశారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా బోర్డుల ఏర్పాటుపై సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జాబ్ చార్టు, పురపాలక, ఇతర శాఖల ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదగాప్రవర్తించాలని సూచించారు.

శ్రీశైలం భక్తులకు రిజర్వేషన్‌తో పాటు దర్శనం టికెట్

ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్

తెనాలిఅర్బన్: శ్రీశైలం వెళ్లే భక్తులకు ప్రయాణ రిజర్వేషన్‌తోపాటు దర్శనం టికెట్లను ఏపీఎస్ ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిందని తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్ టికెట్‌తోపాటు స్పర్శ దర్శనానికి రూ.500, అతి శీఘ్ర దర్శనానికి రూ.300, శీఘ్ర దర్శనానికి రూ.150 అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రేపటిలోగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించండి

తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను బుధవారం నుంచి పూర్తిగా నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటలో తెలిపారు. తెనాలి పట్టణంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను బుధవారంలోపు ఎవరికి వారు తొలగించాలని ఆయన సూచించారు. అధికారుల ఆదేశాలు పాటించకుండా అలానే ఉంచితే మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగించటంతోపాటు ఏర్పాటు చేసిన వారికి అపరాధరుసుం విధిస్తారని హెచ్చరించారు. గురువారం నుంచి అందరూ తప్పని సరిగా క్లాత్ బ్యానర్‌లు, జ్యూట్, క్లాత్ క్యారీ బ్యాగులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

వాసవీ అమ్మవారికి దీపోత్సవం



పూజల్లో పాల్గొన్న బాలస్వామిజీ, మహిళలు

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలీగ్రామ మఠం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవం సందర్భంగా దీపోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పూజ్య శ్రీ బాలస్వామిజీ పర్యవేక్షణలో ఉదయం అభిషేకములు, ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు మహిళలు దీపాలు వెలిగించారు. బాలస్వామిజీ వాసవీ అమ్మవారి విశిష్టతను వివరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మఠం జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, ఉప్పల నాగేశ్వరరావు, గోపు రామకృష్ణ, చుండూరు లోకనాథం దంపతులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, శ్రీ విద్యాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

రైల్లో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైల్లో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి-చెన్నై రైలు మార్గంలోని చుండూరు స్టేషన్ సమీపంలో పట్టాల సమీపంలో మృతదేహం పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించిన పోలీసులు, మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 మధ్య ఉంటుందని, మృతి చెంది వారంరోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచిన సీఎం జగన్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 28వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల జీవన ప్రమాణాలను పెంచిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 28వ వార్డు చెంచుపేట భాను టీ స్టాల్ నుంచి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 28వ వార్డు కౌన్సిలర్ యాతాటి అనిల్, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబం ఈ మూడున్నరేళ్లలో పొందిన లబ్ధి గురించి చెప్పారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ 28వ వార్డులో ఎక్కువ మంది పేదలు, మధ్య తరగతి ప్రజలు నివసిస్తుంటారని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత సుందరయ్యనగర్, ఆలపాటి నగర్, చెంచుపేట డొంక రోడ్డులోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించామని గుర్తు చేశారు. వార్డులో నూరు శాతం సంక్షేమ ఫలాలు అందించినట్లు వివరించారు. ఐదు వేల జనాభా ఉన్న వార్డులో 5,112 మందికి సంక్షేమ పథకాలు అందించినట్టు వెల్లడించారు. గడప గడపకు వెళ్ళినప్పుడు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న జగనన్న గోరు ముద్ద బాగుందని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారని చిన్నారులు తెలియజేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 28వ వార్డు ప్రజలకు రూ.19.24 కోట్ల మేర ప్రయోజనాన్ని కల్పించినట్టు చెప్పారు. సోమవారం ఆలపాటినగర్‌లో పెద్ద వీధి దీపాలు వేయాలని ఓ వ్యక్తి కోరగా, మంగళవారం ఏర్పాటు చేయించామని చెప్పారు. ఫిర్యాదుదారునికి ఫోన్ చేసి మాట్లాడగా ఆనందం వ్యక్తం చేశారని వివరించారు. ప్రజా సమస్యలపై ఎంత బాధ్యతగా ఉన్నామనేదానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, షేక్ దుబాయ్‌బాబు, షేక్ ఇస్మాయేల్, పేరం సంజీవరెడ్డి, తోట రఘురామ్, కొమ్మరబత్తుని జయపాల్, 28వ వార్డు నాయకులు పేరుబోయిన శివ, పందాల జాన్‌పాల్, గుమ్మడి సంపత్ వర్మ, షేక్ అహ్మద్, మొవ్వా నాగరాజు, శెట్టి యేసోబు, దాసరి శ్రీధర్, షేక్ అబ్దులా వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్ కుమార్, కనపర్తి అబ్రహాం లింకన్, ఈద్గా గౌస్, అత్తోట చంటి, శానంపూడి రఘురామిరెడ్డి, కాకి దేవ సహాయం, బండ్లమూడి భాస్కరరావు, కాళిదాసు వెంకట సత్యం, మట్లపూడి రాజేశ్వరరావు, భాస్కర్, మున్నంగి వేణుగోపాల్‌రెడ్డి, చుండూరు సాయి, సిరి కృష్ణ, టోపీ సుభానీ, తాడిబోయిన పోలు రాజు, సయ్యద్ దౌలత్, షేక్ గఫూర్, ఈద్గా గౌస్, రాజ్ కుమార్, దేవరపల్లి భూషణం పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

- ఓటరు దినోత్సవం ముందురోజు తెనాలిలో 2కే రన్
- జెండా ఊపి ప్రారంభించిన సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర గీతాంజలి శర్మ

తెనాలి: ఓటు హక్కు వజ్రాయుధమని సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ చెప్పారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ముందురోజైన మంగళవారం తెనాలిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 2కే రన్‌ను నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటరు నుంచి ఆరంభమైన 2కే రన్ వైకుంఠపురం వరకు కొనసాగింది. తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, తహసీల్దార్ కె.రవిబాబు, అధికారులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ యువత ఓటరుగా నమోదు కావాలని సూచించారు. బుధవారం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసే జాతీయ ఓటరు దినోత్సవంలో 2కే రన్ విజేతలకు బహుమతులను ఇస్తామని పేర్కొన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఓటరు కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్లకు సత్కారం, ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటాయని వివరించారు. ఓటు హక్కుపై అవగాహన నిమిత్తం వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్టు చెప్పారు.

బాలికోత్సాహం

వైభవంగా జాతీయ బాలికా దినోత్సవం



బాలికా దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ యర్రయ్య, క్రాఫ్ కో–ఆర్డినేటర్ వెంకయ్య తదితరులు



చర్చా పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తెనాలిరూరల్/తెనాలిటౌన్: బాలికల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి బి.మనోరంజని సూచించారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ కళాశాలలో మంగళవారం జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. బాలబాలికలకు సమాన హక్కులు ఉంటాయని, బాలికలు ఎందులోనూ తక్కువ కాదని పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారని, బాలికలు చిన్నతనం నుంచే బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులూ పుత్రులతో సమానంగా పుత్రికలను చూడాలని సూచించారు. ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, సీడీపీఓ డి.గీతాంజలి, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ డైరెక్టర్ ఫ్రాన్సిస్, అంబేడ్కర్ కళాశాల కార్యదర్శి మన్నవ మేరీ గ్రేస్, ప్రిన్సిపల్ జె.సుధీర్, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జీవనలత, రాధిక, సుచిత, వెంకటలక్ష్మి, యామిని, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ పాఠశాలల విద్యార్థినులు, అంబేడ్కర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొలుత చినరావూరు పార్కు వద్ద మానవహారంగా ఏర్పడి 'మగువ మగువ.. కావాలి తెగువ- ఆడపిల్ల చదువు ఊరంతా వెలుగు' అంటూ నినాదాలు చేశారు. అదే విధంగా బాలికా దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

హాఫ్‌పేటలో..

హాఫ్‌పేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం చైల్డ్‌రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ తలమాల యర్రయ్య, క్రాఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.వెంకయ్య పోస్టర్లు ఆవిష్కరించారు అనంతరం బాలికల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్త అనూష, క్రాఫ్ ప్రతినిధి గాయత్రి, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, బాలలు పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష తగదు

కొల్లిపర: బాలికలపై వివక్ష తగదని ఐసీడీఎస్ కొల్లిపర సెక్టార్ సూపర్‌వైజర్ వై.నాగమణి చెప్పారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం హైస్కూల్ విద్యార్థినులకు ఐసీడీఎస్ ఈమని సెక్టార్ ఆధ్వర్యంలో బాలికల హక్కుల గురించి వివరించారు. 8, 9, 10 తరగతుల బాలికలకు సోషల్ మీడియా లాభాలు, నష్టాలు, సమతుల ఆహారం గురించి వివరించారు. అనంతరం వారికి చర్చా పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.శకుంతల, హెచ్‌ఎం గణేష్ , మహిళ పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఉద్యమానికి సంఘీభావం



సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెనాలి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి మద్దతుగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం తెనాలిలో ప్రదర్శన నిర్వహించారు. తెనాలి, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల పార్టీ, ప్రజాసంఘాల కార్యకర్తలు, నాయకులు తెనాలి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రదర్శన చేశారు. 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' అంటూ నినాదాలు చేశారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రదర్శన స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నాక సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు మన అందరి హక్కు అని, ఉక్కు ఫ్యాక్టరీని విశాఖలోనే కొనసాగించే వరకు ఉద్యమించాలని చెప్పారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న ఫ్యాక్టరీని బడా స్వాములకు అప్పగించటం సహించరానిదని పేర్కొన్నారు. లక్షమందికి పైగా ఉపాధి కల్పిస్తున్న ఫ్యాక్టరీని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని కేంద్రప్రభుత్వం చూడటం శోచనీయమన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి పూర్తి మద్దతునిస్తున్నట్టు చెప్పారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వెలుగూరు రాధాకృష్ణమూర్తి, గురుబ్రహ్మం, శ్రీకాంత్, మంగళగిరి నాయకులు చినతిరుపతయ్య, వుప్పాల సత్యనారాయణ, కంచర్ల కాశియ్య, మద్దినేని కిరణ్‌బాబు, పాశం వెంకటేష్, బొర్రా శ్రీనివాసరావు, వైపీ రాంబాబు, శివాజి పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్లకు అంకితభావం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ ప్రెసిడెంట్ మార్కండేయులు

తెనాలిటౌన్: ఎల్‌ఐసీ ఏజెంట్లకు అంకితభావం అవసరమని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజంట్ల ఫెడరేషన్ (లియాఫి) జోనల్ ప్రెసిడెంట్ బి.మార్కండేయులు పేర్కొన్నారు. కొత్తపేటలోని ఎల్‌ఐసీ కార్యాలయ ఆవరణలో మంగళవారం రాత్రి ఏజెంట్ల వృత్తి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. లియాఫి తెనాలిశాఖ అధ్యక్షులు బి.పీటర్‌పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా మార్కండేయులు మాట్లాడుతూ ఏజెంట్లు సంఘటితంగా ఉండి వృత్తిని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఎడ్యుకేషనల్ లోన్స్, మెడిక్లయిమ్ పెంపుదల వంటి డిమాండ్లను సాధించుకున్నామని వివరించారు. సీనియర్ ఏజంట్లను సన్మానించుకోవడం ఆనందంగా ఉందని పీటర్‌పాల్ తెలిపారు. కార్యక్రమంలో లియాఫి తెనాలి కార్యదర్శి దిరిశాల వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోకల నాగేశ్వరరావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రవీంద్రరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కల్లాం శ్రీనివాస్‌రెడ్డి, లియాఫి తెనాలి శాఖ గౌరవ అధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్, కోశాధికారి జెఎస్ఎస్.మూర్తి, నాయకులు ఏవీ శ్రీనివాసరావు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కర్నాటి ఉమామహేశ్వరరావు, వెనిగళ్ళ రమేష్‌బాబు, పిల్లి వెంకటేశ్వరరావు, వెచ్చా నాగరాజు, బిటివిఎస్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్డు మార్చి వృద్ధుడిని ఏమార్చి..

తెనాలిరూరల్: ఏటీఎంలో వృద్ధుడికి సహాయం చేసినట్టు నటించిన అగంతకుడు ఆయన్ను మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెనాలి కొత్తపేటలోని ఓ ఏటీఎంకు వృద్ధుడు సోమవారం వెళ్లాడు. నగదు విత్‌డ్రా చేసేందుకు ఇబ్బంది పడుతుండగా, అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి సహాయం చేస్తానని వచ్చాడు. మూడు సార్లు వృద్ధుడి డెబిట్ కార్డుతో ట్రాన్సాక్షన్ చేసినట్టు ఏటీఎంను ఆపరేట్ చేశాడు. కార్డు పిన్ లాక్ అయిందని, బ్యాంకును సంప్రదించాలని చెప్పి మరో కార్డు ఇచ్చి పంపాడు. బ్యాంకుకు వెళ్లిన వృద్ధుడు కార్డు తనది కాదని, తన ఖాతాలో రూ.30 వేలు విత్‌డ్రా చేసినట్టు తెలుసుకుని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

వలంటీర్ స్థానానికి దరఖాస్తు చేసుకోండి

దావులూరు(కొల్లిపర): కొల్లిపర మండల పరిధిలోని దావులూరు గ్రామంలో ఖాళీగా ఉన్న వలంటీర్ స్థానానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాద్ తెలిపారు. గ్రామంలో ఎస్టీ రిజర్వేషన్ అయిన వలంటీర్ స్థానానికి అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైభవంగా భావనారుషి కల్యాణ మహోత్సవం



నెమలి వాహనం భావనారుషి స్వామిని ఊరేగిస్తున్న సంఘు నాయకులు

తెనాలిటౌన్: భద్రావతి సమేత భావనారుషి స్వామి దేవస్థానంలో కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పద్మశాలీయ బహుతమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో మంగళవారం స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. రాత్రి నెమలి వాహనంపై స్వామిని ఉంచి పట్టణ వీధులలో ఊరేగించారు. పెద్ద శ్రేష్ఠులు జొన్నాదుల కృష్ణసత్యనారాయణ, కోటేశ్వరరావు, తాడిపర్తి శివసత్యనారాయణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ ఆలూరి శ్రీను, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు బిట్రా రామలింగేశ్వరరావు, పద్మశాలీయ బహుత్తమ సంఘ అధ్యక్షులు బట్టు జగత్ కోటి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

ఎస్పీ వకుల్ జిందాల్



నాగమల్లేశ్వరికి నగదు చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. తెనాలి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ 2506)గా విధులు నిర్వహిస్తూ.. అనారోగ్యంతో మృతి చెందిన కె.వెంకటేశ్వరరావు సతీమణి కె.నాగమల్లేశ్వరికి అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.1,00,000ల చెక్కును మంగళవారం జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంకిత భావంతో విధులు నిర్వహించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు సాయం అందించడానికి ఎల్లవేళల పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ బీ సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధిక పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వండి



కమిషనర్ జశ్వంతరావుకు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కమిషనర్ ఎం.జశ్వంతరావుకు మంగళవారం ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తెనాలి కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి మాట్లాడుతూ ప్రతిరోజూ తెల్లవారుజామున వచ్చి విధులకు హాజరవుతున్నామని, ఆ సమయంలో కార్యాలయానికి వెళ్ళి ముఖ అధారిత హాజరు వేయటం ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. అలాగే గురువారం సెలవురోజు కూడా హాజరు వేయాల్సి వస్తుందని తెలిపారు. హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంగళగిరి పద్మ, మంద్రు మరియమ్మ, రాచూరి వెంకటేశ్వర్లు, ఉన్నవ సుధాకర్, పి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు కుటుంబరావుకు సన్మానం



కుటుంబరావును సన్మానిస్తున్న రామమూర్తి, శ్రీనివాసరావు తదితరులు.

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం అక్బర్ సలీం అనార్కలి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం యుగంధర్ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ రంగస్థల కళాకారుడు పందూరి కుటుంబరావును సన్మానించారు. కార్యక్రమంలో బడుగు రామమూర్తి, కనగాల శ్రీనివాసరావు, ఉరిటి శ్రీనివాసరావు, బడుగు రాంబాబు, సోమవరపు సాంబశివరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, మైనేని నాగభూషణం, తరిణీ హేమంత్ కుమార్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సేద్యంలో మెలకువలు పాటించాలి



రైతులతో మాట్లాడుతున్న రామాంజనేయులు

మున్నంగి(కొల్లిపర): రైతులు జొన్న , మొక్కజొన్న సేద్యంలో మేలైన యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పి.రామాంజనేయులు చెప్పారు. మంగళవారం మున్నంగి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటల విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి తమ సమస్యలు తెలిపితే ఉన్నతాధికారులు, లేదా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సూచనలు, సలహాలు అందిస్తారని వివరించారు. అనంతరం రైతులకు వ్యవసాయాధికారులు ట్రైకోడర్మా విరిడే జీవశిలీంధ్రం కల్చర్ తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి దీనమ్మ, లామ్‌ఫాం శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్, తెనాలి ఏడీఏ కె.వెంకటరావు, వీఏఏ మహాలక్ష్మి, వీహెచ్ఏ గోపిరెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



బుర్రిపాలెం ఆర్‌బీకేలో మాట్లాడుతున్న లాంఫాం శాస్త్రవేత్త ప్రసాదరావు

తెనాలిటౌన్: బుర్రిపాలెంలోని రైతుభరోసా కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ జి.ఎం.వి.ప్రసాద్ మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. జొన్న, రాగి, కొర్రలు, సజ్జలు, వరిగ, ఆరిక, సామల గురించి వివరించారు. ఈ పంటల సాగుకు నీరు, ఖర్చు తక్కువ అని, ఆహార పంటల్లో భాగంగా సాగు చేసుకోవాలని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రామాంజనేయులు మాట్లాడుతూ జొన్నలో కలుపు సమస్య, నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు, కత్తెర పురుగు నివారణ గురించి వివరించారు. ఎస్‌ఎఫ్ఎస్‌ఎం కన్సల్టెంట్ (గుంటూరు) శ్రీవాణి మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించినట్లు వివరించారు. ఏఓ జి.ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ రైతులందరూ ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని, పీఎం కిసాన్‌లో ఎవరికైతే నగదు జమ కాలేదో వారు పీఎం కిసాన్ ఈకేవైసీని మీసేవా కేంద్రాల్లో చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మోహన్, రైతు భరోసా కేంద్ర వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి క్రీడాకారుడిగా ఎదగాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వివేక విద్యా సంస్థల డైరెక్టర్ వీరనారాయణ, ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: ప్రతి విద్యార్థీ చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరిచి గొప్ప క్రీడాకారునిగా ఎదగాలని వివేక విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్.వీరనారాయణ చెప్పారు. అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం అవుతు రామిరెడ్డి మెమోరియల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో విద్యార్థినులకు ఖోఖో, బాలురకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ భీమవరపు పద్మావతి విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు 9 ఖోఖో జట్లు, 8 క్రికెట్ జట్లు వచ్చాయి. ఖోఖో విజేతగా తెనాలిలోని వివేకానంద సెంట్రల్ స్కూల్, రన్నర్స్‌గా కొల్లిపరలోని హోలీ క్రాస్ స్కూల్ నిలిచాయి. క్రికెట్ విజేతగా కొల్లిపరలోని హోలీ క్రాస్, రన్నర్స్‌గా కొల్లూరు వివేక జట్టు బహుమతులు పొందాయి. ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి కనబరిచి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. అనంతరం వివేక విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్.వీరనారాయణను స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో అవుతు రామిరెడ్డి మెమోరియల్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు అవుతు కృష్ణారెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అక్షయ్ పాల్గొన్నారు.